క్లుప్తంగా

పల్లకీలో ఊరేగిన రంగనాథుడు


పూజలందుకుంటున్న స్వామి వారు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో వెలసిన ప్రసిద్ధ శ్రీరంగనాథస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి సతీసమేతంగా పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ముందుగా మూలవిరాట్ శ్రీరంగనాథస్వామి, శ్రీదేవి, భూదేవిలకు ఉదయం బిందె సేవ, అభిషేకం, అష్టోత్తరనామార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయంలో ప్రదక్షిణ కార్యక్రమాలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాశీంస్వామి ఉరుసు


పూజల్లో పాల్గొన్న ఎస్‌ఐ, గ్రామ పెద్దలు

తుగ్గలి: గ్రామస్తుల ఆరాధ్య దైవం కాశీంస్వామి ఉరుసు ఉత్సవాలను పెండేకల్లులో ఘనంగా నిర్వహిస్తున్నారు. కులమతాలకతీతంగా గ్రామస్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శనివారం దర్గాను సందర్శించి స్వామికి చెక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గ్రామ పెద్దలు, దర్గా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. పూజల్లో తుగ్గలి ఎస్‌ఐ మల్లికార్జునతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత


క్రీడా సామగ్రిని అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

తుగ్గలి: తాము చదువుకున్న పాఠశాలకు చేయూతనందించారు పూర్వ విద్యార్థులు. మండల పరిధిలోని జొన్నగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1996–2001 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ వంతుగా గోడ గడియారంతో పాటు, రూ.10వేల విలువ చేసే క్రీడా సామగ్రిని శనివారం హెచ్‌ఎం ఉపేంద్రకు అందజేశారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులను హెచ్‌ఎం అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓబులేసు, పీఎంసీ చైర్మన్ రఘు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగహన

మద్దికెర: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఎంఈఓ రంగస్వామి, ప్రభుత్వ వైద్యాధికారిణి రాగిణి సూచించారు. శనివారం మండలంలోని బురుజుల, మద్దికెర-3 సచివాలయాల పరిధిలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఏఓ రవి, ఏఈ ఉమాకాంత్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా వర్తింపచేయండి

మద్దికెర: అర్చకత్వం చేస్తూ దేవస్థానాల పొలాలను అనుభవిస్తున్న అర్చకులకు వైఎస్సార్ రైతు భరోసా పథకం వర్తింపచేయాలని ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తహసీల్దార్ నాగభూషణంకు శనివారం విన్నవించి వినతిపత్రం అందజేశారు.

సారా విక్రేత అరెస్టు

కృష్ణగిరి: మండల పరిధిలోని పందిర్లపల్లె గ్రామ శివారులో దాసరోళ్ల గుట్ట వద్ద అక్రమంగా సారా విక్రయిస్తున్న గ్రామానికి చెందిన పెద్ద రంగన్నను శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

పత్తికొండ రూరల్: స్థానిక ఉర్దూ పాఠశాల విద్యార్థులకు టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శనివారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. తన కుమారుడు వరుణ్ పుట్టినరోజు సందర్భంగా ఉర్దూ స్కూల్‌లో 150 మంది విద్యార్థులందరికీ పలకలు, పెన్నులు, పెన్సిల్‌లు, బిస్కెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు మస్తాన్‌వలి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రశాంత జీవనాన్ని గడపండి

కృష్ణగిరి: శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రశాంత జీవనాన్ని గడపాలని ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. శనివారం ఆయన పోతుగల్లు తదితర గ్రామాల్లో గ్రామస్తులతో మాట్లాడారు. ఏ సమస్య వచ్చినా స్టేషన్‌కు తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.


ఉత్సవ మూర్తికి పూర్ణకుంభ స్వాగతం


ఆలయంలో హారతి తీసుకుంటున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ఎర్రకోట జగన్


ఉత్సవాల్లో మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, ధరణీధర్‌రెడ్డి


పూజలో వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీ బుట్టా రేణుక


కులమతాలకు అతీతంగా రథోత్సవాన్ని తిలకిస్తున్న ముస్లింలు


వివిధ వేషధారణలతో ఆకట్టుకున్న యువత


ఆలయం వద్ద భక్తుల రద్దీ


భారీ జనసందోహం మధ్య సాగుతున్న రథోత్సవ దృశ్యం


నందికోల ఉత్సవంలో భక్తులు

రమణీయం..నీలకంఠేశ్వరుని రథోత్సవం

ఎమ్మిగనూరు టౌన్/రూరల్: నీలకంఠేశ్వరస్వామి రథోత్సవం శనివారం సాయంత్రం కడు రమణీయంగా సాగింది. స్వామివారి రథోత్సవాన్ని లక్షలాది మంది భక్తజనుల తిలకించి పులకించిపోయారు. అంతకుముందు నీలకంఠుడికి విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ ప్రతిమను ఊరేగింపుగా తీసుకువచ్చి తేరుబజార్‌లో పీఠంపై ఆశీనులను చేసి హోమాన్ని నిర్వహించారు. పూర్ణకుంభంతో స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. చివరిగా స్వాముల వారిని మహారథంపై ఆశీనులను చేసి రథోత్సవాన్ని మార్కెండేయస్వామి ఆలయం వరకు లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. నీలకంఠుడి ఆలయ ధర్మకర్తలు మాచాని నీలమురళీధర్, శివశంకర్‌ల ఆధ్వర్యంలో రథోత్సవ కార్యక్రమం వైభవంగా ముగిసింది. రథోత్సవాన్ని తిలకించేందుకు సోమేశ్వర థియేటర్ సర్కిల్‌తో పాటు సోమప్ప సర్కిల్ వద్ద ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా డీఎస్పీ సీతారామయ్య ఆధ్వర్యంలో సీఐలు మధుసూదన్‌రాజు, మోహన్‌రెడ్డి, గుణశేఖర్‌బాబు, ఎస్‌ఐలు పోలీసు బందోబస్తు నిర్వహించారు.

నీలకంఠుడికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నీలకంఠేశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా శనివారం ఉదయం స్వామి వారి ఆలయంలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి, పార్టీ కన్వీనర్ బీఆర్ బసిరెడ్డిలు ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఆలయ ధర్మకర్త మాచాని నీలమురళీధర్, శివశంకర్.. ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రథోత్సవంలో ప్రముఖులు

నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీ బుట్టా రేణుక, మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఆయన తనయుడు ధరణీధర్‌రెడ్డి, రాష్ట్ర వీరశైవలింగాయత్ చైర్మన్ రుద్రగౌడ్, కుర్ణికరికల చైర్మన్ బుట్టా శారద, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జ్ తిక్కారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వర్‌రెడ్డి, సబ్‌కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు రథోత్సవంలో పాల్గొన్నారు.


మిద్దెలు ఎక్కి రథోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి. చిత్రంలో మాజీ ఎంపీ బుట్టా రేణుక

- మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మిగనూరులో మళ్లీ వైఎస్‌ఆర్‌సీపీ జెండా ఎగురవేసేందుకు సమష్టిగా కృషి చేద్దామని మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అంతకుముందు బుట్టా రేణుక, ఆమె భర్త బుట్టా నీలకంఠ.. ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి సత్కరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, రాష్ట్ర కుర్ణికరికల చైర్మన్ బుట్టా శారదమ్మ, ఎంపీపీ కేశన్న, పార్టీ జిల్లా కార్యదర్శులు లక్ష్మికాంతారెడ్డి, రియాజ్‌అహమ్మద్, పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని వెంకటగిరి గ్రామ క్రాస్ రోడ్డు దగ్గర శనివారం భారీగా కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నారు. సాయంత్రం రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ మోహన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. వెంకటగిరి క్రాస్ రోడ్డు దగ్గర వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా నారబండ గ్రామానికి చెందిన వ్యక్తి కారులో 20 బాక్సుల్లో 1920 (ఎంఎల్) రాయల్ ఒరిజన్ చాయిస్ విస్కీ కర్ణాటక టెట్రా ప్యాకెట్లు కనిపించాయన్నారు. వాటిని తరలిస్తున్న రమేష్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ.1.20 లక్షలు ఉంటుందన్నారు. అలాగే నందవరం మండలం నాగలదిన్నె చెక్ పోస్ట్ దగ్గర కనకవీడు గ్రామానికి చెందిన మాల గోవిందు దగ్గర నుంచి 6 బాక్సుల్లో 576 రాయల్ ఒరిజినల్ చాయిస్ విస్కీ కర్ణాటక టెట్రా ప్యాకెట్లను పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ. 36 వేలు ఉంటుందని చెప్పారు. విలేకరుల సమావేశంలో రూరల్, నందవరం ఎస్‌ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, తిమ్మయ్య, పీసీలు రమేష్, మల్లయ్య, ప్రకాష్, సోమశేఖర్ పాల్గొన్నారు.


పట్టుకున్న కర్ణాటక మద్యాన్ని చూపుతున్న పోలీసులు

పార్టీ విజయానికి కృషి చేద్దాం

- వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బూసినేని విరుపాక్షి

ఆలూరు: పార్టీ విజయానికి కృషి చేద్దామని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బూసినేని విరుపాక్షి అన్నారు. కోటవీధిలో దేవమ్మవ్వ ఆలయ నిర్మాణ పనులకు శనివారం ఆయన రూ.30 వేలు విరాళమిచ్చారు. అనంతరం వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన నాయకులు,కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో ఆయన మాట్లాడారు. కలిసి కట్టుగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. నవరత్నాల ద్వారా ప్రతి ఇంటికి అందిన ఫలాలను వివరించి వైఎస్సార్‌సీపీకి ఓటేసేలా అవగాహన కల్పించాలన్నారు.


పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ఆస్పరి: పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెద్దయ్య సూచించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త బుసినే విరుపాక్షి ఆదివారం విరుపాక్షి మండలంలో పర్యటించనున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు సుంకర రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న సమన్వయకర్త విరుపాక్షి

పంట నూర్పిళ్లలో అన్నదాతలు

కృష్ణగిరి: మండలంలో రబీ పంటల నూర్పిళ్లలో అన్నదాతలు బిజీగా ఉన్నారు. శనగ, జొన్న, వాము, పొద్దుతిరుగుడు తదితర పంటలను అన్నదాతలు నూర్పిళ్లు చేస్తున్నారు. పంటసాగు చేసినప్పటి నుంచి వర్షాలు లేకపోవడంతో ఈయేడాది దిగుబడులు ఆశించినంతగా రావడం లేదని రైతులు తెలిపారు. రేగడి పొలాలు ఉన్న గ్రామాల్లో కూలీల కొరత ఉండటంతో అన్నదాతలు యంత్రాలతో పంటలను తొలగిస్తున్నారు. ఈ విధంగా చేయడం వల్ల సమయం ఆదాతోపాటు కూలీల ఖర్చు కూడా తగ్గుందని రైతులు తెలియజేస్తున్నారు.


టి.గోకులపాడు సమీపంలో వాము పంటలను తొలగిస్తున్న కూలీలు

అట్టహాసంగా క్రీడాపోటీలు ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి


విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి


విజేత జట్టుతో అధికారులు

ఎమ్మిగనూరుటౌన్: నీలకంఠేశ్వర స్వామి మహారథోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో ఆర్గనైజర్లు మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పాల శ్రీనివాసరెడ్డి, విశ్వనాథ్‌రమేష్, బాబుఖాన్ ఏర్పాటు చేసిన వైఎస్సార్ అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్, వాలీబాల్ పోటీలను శనివారం జూనియర్ కళాశాల మైదానంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. అంతకు ముందు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడాలను ప్రారంభించారు. క్రీడాకారులు స్నేహభావంతో ఆడాలని గెలుపోటములు సమానంగా తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేశన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసిరెడ్డి, పట్టణ అధ్యక్షులు బుట్టా రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత కేజీఎస్ లెవెన్స్

నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా నెల రోజులుగా నిర్వహించిన వైఎస్సార్ అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీల్లో కేజీఎస్ లెవెన్ లైన్స్ జట్టు విజేతగా నిలిచింది. రెండవ స్థానం ఆదోని సచిన్ లెవెన్స్ జట్టు సాధించింది. శనివారం మొదటి, రెండవ బహుమతిగా రూ.1లక్ష, రూ.50వేల మెగా చెక్కుతో పాటు ట్రోఫీని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎద్దుల బండలాగుడు పోటీలు

నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా అంతర్రాష్ట్ర ఒంగోలు ఎద్దుల బండలాగుడు పోటీలను ఆదివారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు వైడబ్ల్యూసీఎస్ మైదానంలో నిర్వహించనున్నారు.

కబడ్డీలో విజేత కైరుప్పల

ఆస్పరి: 'ఆడుదాం- ఆంధ్ర క్రీడా పోటలలో భాగంగా శనివారం ఆలూరు నియోజకవర్గ స్థాయి మహిళల కబడ్డీ పోటీల్లో కైరుప్పల గ్రామానికి చెందిన కబడ్డీ జట్టు విజయం సాధించినట్లు పీడీ రామాంజనేయులు తెలిపారు. విజేత జట్టను మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సర్పంచ్ తిమ్మక్క, గ్రామస్తులు అభినందించారు.

పూడ్చిన మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం

నందవరం: మండలంలోని నాగలదిన్నె గ్రామానికి చెందిన వడ్ల నారాయణమ్మ (55) మృతదేహాన్ని వెలికితీసి శనివారం పోస్ట్‌మార్టం నిర్వహించారు. నరసింహాచారికి నారాయమ్మ, భీమమ్మ ఇద్దరు భార్యలు. నారాయణమ్మకు సంతానం కలగకపోవడంతో నరసింహాచారి భీమమ్మను వివాహం చేసుకున్నాడు. ఈమెకు కూతురు ఉంది. అనంతరం నరసింహాచారి మృతిచెందడంతో నారాయణమ్మ, భీమమ్మ వేర్వేరేగా జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో గత ఏడాది ఆగస్ట్ 3న ఇంట్లో నిద్రిస్తూ ప్రాణాలు విడిచింది. మృతి పట్ల అప్పట్లో ఆమె సోదరుడు పంపణ్ణ ఆచారి అనుమానం వ్యక్తం చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు సరిగా స్పందించకపోవడంతో అంత్యక్రియలు పూర్తి చేశారు. దీంతో పంపణ్ణ ఆచారి హైకోర్టును ఆశ్రయించాడు. విచారించిన న్యాయస్థానం పోస్ట్‌మార్టం జరిపించాలని పోలీసులను ఆశ్రయించడంతో శనివారం డీఎస్పీ సీతారామయ్య ఆధ్వర్యంలో ఫోరెన్సిక్ ప్రొఫెసర్ (కర్నూలు మెడికల్ కాలేజ్) డాక్టర్ బ్రహ్మజీ, తహసీల్దార్ నిత్యానందరాజు తదితరులు పోస్ట్‌మార్టం నిర్వహించారు. పూడ్చిన మృతదేహాన్ని వెలికితీసి పోస్ట్‌మార్టం నిర్వహించడంతో గ్రామంలో చర్చనీయాంశమైంది.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ సీతారామయ్య, అధికారులు

నెరణికిలో జగనన్న ఆరోగ్య సురక్ష

హొళగుంద: నెరణికి గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు బిందుమాధవి, న్యూటన్, వైద్య సిబ్బంది ప్రజలకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కురువ వన్నూరమ్మ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశా

- ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా నాలుగున్నరేళ్లుగా పనిచేశానని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో డివిజన్ స్థాయి మెన్స్ డబుల్స్ షటిల్ టోర్నమెంట్‌ను తహసీల్దార్ ఆంజనేయులు, కమిషనర్ గంగిరెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఇండోర్ స్టేడియం అభివృద్ధికి రూ.5 లక్షల మేర ఖర్చు చేశామన్నారు. కార్యక్రమంలో ఎల్లెల్సీ డీఈ లక్ష్మణ్‌కుమార్, రిటైర్డ్ ఏఎస్‌డబ్ల్యూఓ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఆలూరు క్రీడాకారులు

ఆలూరు రూరల్: ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. గత నెల 15 నుంచి నిర్వహిస్తున్న సచివాలయ, మండల, నియోజకవర్గ స్థాయి షటిల్ పోటీల్లో ఆలూరుకు చెందిన ఇసాక్, మధు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పీడీ కవిరాజు తెలిపారు. ఫిబ్రవరి 1 నుంచి 5వ తేదీ వరకు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఆడుదాం–ఆంధ్రా పోటీల్లో పాల్గొంటారన్నారు.

నేడు పత్తికొండలో చంద్రబాబు పర్యటన

పత్తికొండ రూరల్: పత్తికొండలో ఆదివారం జరిగే టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటన విజయవంతం చేద్దామని మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, మంత్రులు కేఈ ప్రభాకర్, భూమా అఖిలప్రియ అన్నారు. పత్తికొండ–ఆదోని రోడ్డులోని ఓ వెంచర్ లో జరగనున్న బహిరంగ సభ ప్రాంగణాన్ని శనివా రం పార్టీ ఇన్‌చార్జ్ కేఈ శ్యాంబాబుతో కలిసి పార్టీ ముఖ్యనేతలు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ సాయంత్రం 4గంటలకు వెంచర్ సమీపంలో ఏర్పాటు చేసిన హెలీపాడ్ నుంచి సభా ప్రాంగణానికి చేరుకుని అక్కడ బహిరంగ సభలో ప్రసంగిస్తారన్నారు. సభ ముగిసిన అనంతరం సా యంత్రం గోపాల్ ప్లాజాలో పార్టీ ముఖ్యనేతలతో సమావేశమై, అక్కడే రాత్రి బస చేస్తారన్నారు. భారీ వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా వాటిని మళ్లించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చే శామని డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి విలేకరులకు తెలిపారు.